క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం చిప్పాడ ఫీడర్ పరిధిలో మంగళ వారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగ నుందని అనకాపల్లి డివిజన్ విద్యుత్ కార్యా లయం ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలి పారు. ఫీడర్ మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

యలమంచిలి రూరల్: దార్లపూడి 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం చినగుమ్ములూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతు పనుల కారణంగా మండలంలోని మేజర్ పం చాయతీ ఏటికొప్పాకలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అన కాపల్లి ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ ఓ ప్రక టనలో తెలిపారు. ఏటికొప్పాకలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

19న గంగాలమ్మ తల్లి పండగ


మూలపేటలోని గంగాలమ్మ తల్లి

మునగపాక: మండలంలోని మూలపేటలో ఈ నెల 19న గంగాలమ్మతల్లి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేటి నుంచి ధ్యాన మహాయాగం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం– అందలాపల్లి భగీరథ ఆలయం పక్కన మంగళవారం నుంచి ధ్యాన మహాయాగం నిర్వహించనున్నట్టు శ్రీగిజా పిరమిడ్ వ్యవస్థాపకుడు లీలా ప్రసన్నకుమార్, శివ గణేశ్వరరావు ఓ సంయుక్త ప్రకటనలో తెలి పారు. ఈ నెల 19వ తేదీ వరకు రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సంగీత ధాన్యంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 19న డాక్టర్ మాధవరావు మహిళల గైనిక్ వ్యాధులపై అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. శ్రీగిజా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

125 లీటర్ల నాటు సారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సారాతో సీఐ అప్పన్న

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామ సమీపాన అక్రమంగా తరలిస్తున్న 125 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ జి.ఎస్.అప్పన్న తెలిపారు. గోపాలపట్నం గ్రామానికి చెందిన వాడబోయిన కొండబ్బాయితో కలిసి మరొక బాలుడు 5 ప్లాస్టిక్ డబ్బాలతో 125 లీటర్లు నాటుసారాను పెంటకోట శివారున ఉన్న నది నుంచి పడవలో తరలిస్తున్నారు. పోలీసులు గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. సారాను స్వాధీనం చేసుకుని, నిందితుడిని యలమంచిలి కోర్టుకు, బాలుడిని జువైనల్ కోర్టుకు తరలించామని సీఐ తెలిపారు.

సీఆర్‌ఎంటీ ఉద్యోగ భద్రతపై భయాందోళన

అనకాపల్లి: నూతన విద్యా విధానం –2020లో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో క్లస్టర్ రిసోర్స్ సెంటర్ పునర్ వ్యవస్థీకరణ జరుగుతున్నప్పటికీ, క్లస్టర్ పరిధి ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పూడి వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా శాఖలో కీలక అంశమైన క్లస్టర్ రిసోర్స్ సెంటర్లను కుదిస్తున్నారన్నారు. దీంతో క్లస్టర్ ప్రాతిపదికన రోస్టర్ విధానంలో ఉద్యోగాలకు భద్రత లేకుండా పోతుందన్నారు. 12 సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనంతో విద్యా శాఖ సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వాలు ఎప్పుడైనా సీఆర్‌ఎంటీ/సీఆర్పీలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు.

ప్రయాణం.. నరకం

- అధ్వానంగా దర్శనమిస్తున్న గ్రామీణ రహదారులు
- రాళ్లు తేలిన పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు
- అభివృద్ధికి ఆమడ దూరంలో మునగపాక ఇందిరమ్మ కాలనీ రోడ్డు


రాళ్లు తేలిపోయిన పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి


పక్కా రోడ్డుకు నోచుకోని మునగపాక ఇందిరమ్మ కాలనీ మార్గం


అభివృద్ధికి నోచుకోని వాడ్రాపల్లి–తిమ్మరాజుపేట రోడ్డు

మునగపాక: గ్రామీణ రహదారులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. పలు ప్రాంతాల్లో నేటికీ మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మట్టి రోడ్ల కారణంగా వర్షాకాలంలో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

- మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్కూల్‌కు వెళ్లేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి నిత్యం విద్యార్థులు ఆటోలు, సైకిళ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. కాకరాపల్లి నుంచి స్కూల్‌కు వెళ్లే కిలోమీటరు మేర రహదారిపై రాళ్లు తేలిపోయాయి. వర్షం పడితే రోడ్డు మరింత అధ్వానంగా తయారవుతోంది.
- 25 ఏళ్ల కిందట మునగపాక ఇందిరమ్మ కాలనీని ఏర్పాటు చేశారు. అప్పటి జనాభాకు అనుగుణంగా కాలనీకి అవసరమయ్యే స్థలాన్ని రైతుల నుంచి సేకరించారు. 516 మందికి పట్టాలు అందజేశారు. అయితే కాలనీకి వెళ్లేందుకు అవసరమయ్యే రహదారుల అభివృద్ధి కనిపించడం లేదు. ఇటీవల పంచాయతీ ద్వారా కాలనీల్లోని పలు వీధుల్లో గ్రావెల్ రహదారులు ఏర్పాటు చేశారు. వర్షా కాలంలో ఈ మట్టి రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద పేరుకుపోతుందని, రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.
- వాడ్రాపల్లి నుంచి తిమ్మరాజుపేటకు వెళ్లేందుకు పదేళ్ల క్రితం విశాఖ డెయిరీ సహకారంతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలకు చేరుకునేందుకు మునగపాక వెళ్లి అక్కడ నుంచి రాకపోకలు సాగించేవారు. అయితే దివంగత డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు ప్రజల ప్రయోజనాలను గుర్తించి ఇరు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. దీనికి తోడు ఈ మార్గంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ పేరిట పలువురికి పట్టాలు కూడా మంజూరు చేసింది. ఇప్పటికైనా రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు తప్పని పాట్లు



ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా మారుతోంది. కాలనీ ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు అభివృద్ధి చెందలేదు. దీంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారులు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి. – **కొణతాల సంతోష్‌కుమార్**, ఇందిరమ్మ కాలనీ, మునగపాక

స్కూల్ రోడ్డు అభివృద్ధి చాలా అవసరం



పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే మార్గం రాళ్లు తేలిపోయి దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణం నరకంగా ఉంటుంది. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులు ఆటోలు, సైకిళ్లపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుంది. – **కర్రి నాగిరెడ్డి**, ద్విచక్ర వాహనదారుడు, కాకరాపల్లి

ఎటువంటి ప్రతిపాదనలు లేవు

రహదారులకు సంబంధించి కొత్త ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి ప్రతిపాదనలు చేయలేదు. రోడ్ల అభివృద్ధి కోసం ఎటువంటి వినతులు వచ్చినా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – **మురళి**, ఆర్‌అండ్‌బీ ఏఈ

ముంపులోనే వరిపైరు


మునగపాకలో నీట ముంపులోనే వరిపొలం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి ఆవ ప్రాంతంతో పాటు మునగపాక, తిమ్మరాజుపేట గ్రామాల్లో ఇంకా వరిపైరు ముంపులోనే ఉంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలు లోతట్టు ప్రాంతాల్లో వరి పంట ముంపునకు గురైన విషయం తెలిసిందే. అయితే పొలాల్లోకి చేరిన నీరు బయటకు పోయే మార్గాలు లేకపోవడంతో వరిపైరు కుళ్లిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మురుగు వాసన వచ్చేస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎస్‌ఐగా రమేష్ బాధ్యతల స్వీకరణ



కోటవురట్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ఎస్.రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రమణయ్యకు అనకాపల్లి సీఎంఎస్‌కు బదిలీ కాగా.. అనకాపల్లి టౌన్ పీఎస్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న సింకా రమేష్ బదిలీపై కోటవురట్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ చట్ట పరిధిలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


నక్కపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు, వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు


అడ్డురోడ్డు ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మతపెద్దలు

నక్కపల్లి: మిలాద్ ఉన్ నబీని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నక్కపల్లి మండలం పెదబోదిగల్లం, చినబోదిగల్లం, అప్పల పాయకరావుపేట, పెద దొడ్డిగల్లు, రామకృష్ణాపురం ముస్లిం గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల వద్ద పతకాలను ఆవిష్కరించారు. సర్వమత సమ్మేళనంగా కలసిమెలసి జీవిస్తున్నామని, అన్ని మతాల సారాంశం ఒకటేనని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు. అల్లా ఆశీస్సులు అన్ని మతాలు, వర్గాల ప్రజలపై ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, తదితరులు ఆయా వేడుకల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

కోటవురట్ల: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మండంలోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రబోధించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొని నమాజ్ చేశారు. గ్రామంలో శాంతిని కోరుతూ ర్యాలీ చేశారు.

ఓజోన్ పొరను కాపాడండి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఎస్.రాయవరం: ఓజోన్ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీఆర్‌టీయూ సమన్వయ కర్త చోడిశెట్టి సత్యనారాయణ కోరారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఎస్.రాయవరంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అడ్డురోడ్డు, పెదగుమ్ములూరు, తిమ్మాపురం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర సమస్య వల్ల వేడి పెరుగుతోందన్నారు. వాతావరణం కాలుష్యం మానవ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఓజోన్ పొర దెబ్బతినడం వల్ల సూర్యుడి నుంచి వచ్చే అతినీల లోహిత కిరణాలు 97 శాతం నుంచి 99 శాతం నేరుగా భూమిపై పడి జీవాన్ని దెబ్బతీసే సామర్థ్యం కలిగి ఉంటాయని చెప్పారు. వీటి వల్ల చర్మ, జన్యు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, తిమ్మాపురం సర్పంచ్ కర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లపై ఐటీ దాడులు తగదు

- సీఎం రమేష్‌కు యూనియన్ నాయకుల వినతి

కశింకోట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలపై ఆదాయపు పన్ను శాఖ దాడులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా పీఏసీఎస్‌ల యూనియన్ ప్రధాన కార్యదర్శులు గొంప రమణ, బొడ్డేడ రమణ, కోశాధికారి యల్లపు లక్ష్మణరావు కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేష్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. రైతులకు రుణాలు అందించి చేదోడుగా నిలవడానికి సేవా దృక్పథంతో ఏర్పాటైన ఉమ్మడి విశాఖ జిల్లా పీఏసీఎస్‌లపై అపరాధ రుసుంతో ఆదాయపు పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేశారన్నారు. రైతులకు ఎటువంటి ఆర్థిక సేవలు అందించకుండా సహకార సంఘాల ఖాతాలను సీజ్ చేస్తున్నారని విమర్శించారు. దీంతో రైతులకు సేవలు అందించలేని పరిస్థితి నెలకొందన్నారు. దీని దృష్ట్యా ఆదాయపు పన్ను శాఖ దాడులను నివారించాలని వినతి పత్రం అందించగా, ఎంపీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని సహకార సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

అనకాపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల ఎంపిక పోటీలు ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పాఠశాలల మండల ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ ఎస్.వి.నరసింహం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ –14, 17 బాల బాలికల విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. 19న జీవీఎంసీ గవరపాలెం చిన్న హైస్కూల్‌లో ఖో–ఖో, యోగా, చెస్ పోటీలు, 20న జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, 21న ఎన్టీఆర్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ (బాలురు) నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలన్నారు. అండర్–14కు 2011 జనవరి 1వ తేదీ, అండర్–17కు 2008 జనవరి 1వ తేదీ నాటికి జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9247150037 సంప్రదించాలని కోరారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన అవసరం


మల్లవరంలో అవగాహన కల్పిస్తున్న రమణ

మాకవరపాలెం: హెచ్‌ఐవీపై నివారణకు అందరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ డి.రమణ సూచించారు. మండలంలోని ఎం.నగరం, బయ్యవరం గ్రామాల్లో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. లైంగికంగా సంక్రమించే వ్యాధులపై ప్రజలకు వివరించారు. అలాగే సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, కలరా, వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు, నిమజ్జనాలు


మునగపాకలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్


నాగులాపల్లిలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


కొరుప్రోలులో గణపతి మండపం వద్ద కోలాటం ఆడుతున్న చిన్నారులు


ఆకట్టుకున్న కాంతార వేషాలు


అడ్డురోడ్డు మండపం వద్ద హోమం నిర్వహిస్తున్న భక్తులు

మునగపాక: వినాయక చవితి వేడుకల్లో భాగంగా సోమవారం అన్నసమారాధనలు, నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. మునగపాక మెయిన్ రోడ్డులోని లింగంరాయి గుడిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని, అన్నసమారాధనను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, వేగి లక్ష్మణరావు, పెంటకోట సూరిబాబు, కిరణ్, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గొల్లలపాలెంలో వినాయక విగ్రహాన్ని పలువురు భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. నాగులాపల్లిలో వినాయక ప్రతిమను ఊరేగింపు తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

ఎస్.రాయవరం: చవితి వేడుకల్లో భాగంగా అడ్డురోడ్డు శ్రీసిద్ధి వినాయకుని సన్నిధిలో సోమవారం శాంతి హోమం నిర్వహించారు. కొరుప్రోలు కుమ్మర వీధిలో గణపతి మండపం వద్ద చిన్నారుల కోలాటం ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గ్రామాల్లోని మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి వాతావరణం నెలకొంది.

కోటవురట్ల: సీతారామరాజునగర్‌లోని శ్రీబాల వినాయక యూత్ ఆధ్వర్యంలో గణనాథుడిని ఆదివారం రాత్రి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా కాంతార , దుర్గమ్మ, కాళీ మాత, హనుమాన్ వేషధారణలు ఆకట్టుకున్నాయి. గొల్లపేటకు చెందిన కళాకారులు తప్పెటగుళ్లతో సందడి చేశారు.

ఈ నెల 30 నుంచి సమ్మెబాట


నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఏరియా ఆస్పత్రి ఒప్పంద కార్మికులు

నర్సీపట్నం : ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 30వ తేదీ నుంచి వైద్య విభాగం ఒప్పంద కార్మికులు సమ్మె బాట పడుతున్నారని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు రమణ పేర్కొన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రి ఒప్పంద కార్మికులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జిల్లా కలెక్టర్, పార్లమెంట్, శాసన సభ్యులను స్వయంగా కలిసి సమ్మెపై వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో వేతనాలు చెల్లించక కార్మికులు అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేసి కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

పెరిగిన టమాటా ధర

కశింకోట: తాళ్లపాలెంలో సోమవారం జరిగిన వారపు సంతలో టమాటా ధర పెరిగింది. మిగిలిన కూరగాయల ధరలు కూడా బెట్టు మీదే ఉన్నాయి. గత వారం కిలో టమాటా రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. ఉల్లి బెట్టు దిగలేదు. కిలో రూ.60కి విక్రయించారు. బంగాళాదుంప, బెండకాయ, వంకాయ రూ.40, బీట్‌రూట్, క్యారెట్, గోరు చిక్కుడు, బరబాటి రూ.60, క్యాప్సికం రూ.80, చిక్కుడు రూ.160కి విక్రయాలు సాగాయి.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


డీ వార్మింగ్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ జరుగుతుందని ఆరోగ్య విస్తరణ అధికారి సూరిశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,220 మంది విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 913 మంది పిల్లలకు ఈ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాయకరావుపేట: విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. నేషనల్ డీవార్మింగ్ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

నిలకడగా తాండవ నీటిమట్టం

- పంట పొలాలకు 450 క్యూసెక్కుల నీరు విడుదల


నిండుకుండలా తాండవ ప్రాజెక్టు

నాతవరం: మూడు రోజులుగా పంట కాలువలకు రోజుకు 450క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్న తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉందని ప్రాజెక్ట్ జేఈ రామకృష్ణ తెలిపారు. ఎగువ ప్రాంతం ఇన్‌ఫ్లో వల్ల పంట కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నా ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గలేదన్నారు. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టులో నీటి మట్టం 378.3 అడుగులు ఉందన్నారు. పంట కాలువలు ద్వారా వాయకట్టుకు విడుదల చేస్తున్న నీటికి ఇన్‌ఫ్లో నీరు సమానంగా ఉండడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు సమానంగా ఉన్నాయన్నారు. తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా 378 అడుగులు వచ్చేసరికి ప్రమాద హెచ్చరికలు జారీ చేసి స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రమాద స్థాయి నీటి మట్టం ఉన్నా పంట పొలాలకు కాలువలు ద్వారా నీరు విడుదల చేయడంతో స్పిల్‌వే ద్వారా విడుదల చేయలేదన్నారు.

కొనసాగుతున్న ఏలేరు గండి మరమ్మతు పనులు


చివరి దశకు చేరుకున్న గండి పూడ్చివేత పనులు

మావవరపాలెం : ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని రాచపల్లి వద్ద 99వ కిలోమీటరు ప్రాంతంలో ఏలేరు కాలువకు ఆదివారం ఉదయం గండి పడింది. అదే రోజు సాయంత్రం నుంచి జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణలో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. అయితే నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గండి పూడ్చివేతకు ఆటంకం కలిగింది. దీంతో సోమవారం సాయంత్రానికి 80 శాతం పనులు పూర్తయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి ఈ పనులు పూర్తవుతాయని డీఈ కామేశ్వరరావు తెలిపారు. గండి పూడ్చివేత పనులను నర్సీపట్నం ఆర్డీవో జయరాం, స్థానిక తహసీల్దార్ ప్రసాద్ పరిశీలించారు.